ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం

రంగారెడ్డి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగికి తన సర్వీసులో బదిలీ అనేది సహజమని కలెక్టర్ శశాంక అన్నారు. ఇటీవల బదిలీపై రంగారెడ్డి జిల్లా నుంచి ఇతర జిల్లాలకెళ్లిన అధికారులకు శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీతతో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా నుంచి ఇటీవల బదిలీపై ఏడుగురు జిల్లా అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లారన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ జిల్లా నుంచి బదిలీపై వెళ్లిన అధికారులు అక్కడ కూడా ఇదే స్ఫూర్తిగా కొనసాగించాలన్నారు. బదిలీపై జిల్లాకు వచ్చిన అధికారులకు ఈ సందర్భంగా స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి నీరజాగాంధీ, డీసీసీవో ధాత్రీదేవి, జిల్లా పౌర సంబంధాల అధికారిణి పద్మశ్రీ, సివిల్ సప్లయ్ డీఎంవో విజయలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సంగీత, ఏవో సునీల్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుమాధవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పీడీ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, ఉద్యానవన శాఖ భాగ్య లక్ష్మి, డీసీసీవో సుధాకర్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారిణి శ్రీలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి పద్మజారమణ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ రాథోడ్, ఎన్ఐసీ అధికారిణి స్వర్ణలత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్ 2024 చట్టం బిల్లుపై అవగాహన సదస్సు

ఆర్‌వోఆర్ బిల్లుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, చిత్రంలో ధరణి చైర్మన్ కోదండరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్

రంగారెడ్డి, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం ఆర్‌వోఆర్- 2024 చట్టం బిల్లుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, ధరణి చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, బార్ అసోసియేషన్ మెంబర్ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇంకా మెరుగైన భూరికార్డుల విధానాన్ని తీసుకొచ్చేందుకు క్షేత్ర స్థాయిలో సూచనలు, సలహాలను ప్రభుత్వం తీసుకుంటున్నదని పేర్కొన్నారు. సమావేశం ప్రారంభానికి ముందు చేవెళ్ల ఆర్డీవో సాయిరాం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ప్రతిపాదిత రైట్స్ ఆఫ్ రికార్డ్ (ఆర్‌వోఆర్)చట్టంలోని 20 సెక్షన్ల గురించి వివరించారు. ధరణి చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ 2020లో ఏర్పాటు చేసిన చట్టంలో అప్పీళ్లకు అవకాశం లేదని, కొత్త చట్టంలో వాటికి స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. ఎక్కడైనా పొరపాటు జరిగితే సవరించే అవకాశం నైతం నూతన ప్రతిపాదిత చట్టంలో ఉన్నదని.. రానున్న అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల్లో కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టి అమల్లోకి తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఆర్డీవోలు సాయిరాం, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటమాధవరావు, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు సాధించిన శ్రీవైష్ణవి

అభినందించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

ఆమనగల్లు, ఆగస్టు 24 : ఆమనగల్లు మండల కేంద్రంలోని వివేక విద్యాభారతి హైస్కూల్‌లో టెన్త్ చదువుతున్న గంజి శ్రీవైష్ణవి ప్రపంచంలోని అన్ని దేశాల పేర్లు కేవలం 13 నిమిషాల్లోనే రాసిన అతి పిన్న వయస్కురాలిగా ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు, మెడల్‌ను అందుకున్నారు.
ఈ సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు శ్రీవైష్ణవిని కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ మహమూద్, కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులు, ట్రెస్మా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు అవ్వారి శివలింగం, పీఈడీ భాస్కర్‌రెడ్డి, కృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ దార్ల చిత్తరంజన్‌దాసు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరికి చేరుకున్న శిక్షణ బీట్ ఆఫీసర్లు

ఫీల్డ్ శిక్షణలో భాగంగా అనంతగిరికి చేరుకున్న శిక్షణ బీట్ ఆఫీసర్లు

వికారాబాద్, ఆగస్టు 24 : తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపల్లిలో శిక్షణ పొందుతున్న 33 మంది ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఫీల్డ్ శిక్షణలో భాగంగా శనివారం వికారాబాద్ జిల్లాలో అటవీశాఖ చేపట్టిన వివిధ పనులను సందర్శించారు. వృత్తి శిక్షణలో భాగంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అనంతగిరి రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ ఏరియా , వాచ్ టవర్, గ్రాస్‌ల్యాండ్ ఏరియా తదితర ప్రాంతాలను స్టడీ చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ అటవీ భూముల సంరక్షణ, అడవుల అభివృద్ధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు.
ఈ క్రమంలో వారిపై ఒత్తిడి కూడా ఎక్కువగా ఉంటుందని, ఈ వృత్తిపరమైన ఒత్తిడిని అధిగమిస్తూ.. తన సహచరులు, ఉన్నతాధికారులతో ఆరోగ్యకరమైన సంబంధాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఒక్కో ప్రాంతంలోని అడవికి ఒక్కో ప్రత్యేకత ఉంటుందని, దానిని బీట్ ఆఫీసరే గుర్తించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్యామ్‌కుమార్, వికారాబాద్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అరుణ, తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ అసిస్టెంట్ పోస్ట్ డైరెక్టర్ సుభాశ్‌చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలి

పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్

రంగారెడ్డి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): వసతిగృహాల్లో ఆహార నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. శనివారం మహేశ్వరంలోని రేషన్ దుకాణంలో బియ్యం నాణ్యతను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు భోజనం అందించడం కోసం సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యత విషయంలో జాగ్రత్తలు, ప్రమాణాలను విధిగా పాటించాలన్నారు. ఒకవేళ బియ్యం బాగా లేకపోతే సమాచారమిస్తే..వాటికి బదులుగా వేరే బియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఇంట్లో వండిన విధంగానే ఆహారం ఉండేలా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉన్నదని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్

కొడంగల్, ఆగస్టు 24: సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ అన్నారు. శనివారం స్థానిక కడా కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తాపట్నాయక్‌తో కలిసి కొడంగల్ నియోజకవర్గ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి వివిధ అంశాలపై వచ్చిన 874 దరఖాస్తులపై శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. వారంలో కనీసం మూడు రోజులపాటు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించాలని.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా ఎక్కడైతే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయో ఆయా ప్రాంతాలను గుర్తించి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పోలీసు, రవాణా శాఖల అధికారులకు సూచించారు. సమన్వయంతో విధులు నిర్వహిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 30 తేదీలోపు విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విద్యుత్తును సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు నిమిత్తం వచ్చే అర్జీలను పరిశీలించి వాటిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మంగళవారం గ్రీవెన్స్ యాప్‌పై శిక్షణ..

మంగళవారం కడా కార్యాలయంలో గ్రీవెన్స్ రిపోర్టులను తెలుసుకునేందుకు గ్రీవెన్స్ యాప్‌లో అర్జీలను ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ యాప్ ద్వారా సమస్య పరిష్కరమైందో..లేదో తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్‌పై అన్ని శాఖల అధికారులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల ఎస్పీలు నారాయణరెడ్డి, యోగేశ్‌గౌతమ్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్ తదితరులు

వర్గీకరణ అంతం.. దళితుల పంతం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్

రవీంద్రభారతి, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో పలువురు వక్తలు ప్రకటించారు. ఈ సందర్భంగా సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజన పార్టీ డీబీపీ జాతీయ అధ్యక్షుడు సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణ అంతం.. దళితుల పంతం అనే నినాదంతో పాలకుల పైన పోరాటం చేస్తామన్నారు. వర్గీకరణపైన సుప్రీం కోర్టు తీర్పును ఉపసంహరించుకోవాలని కోరారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం, రేవంత్‌రెడ్డి చేస్తున్న వర్గీకరణ ప్రయత్నం ఆర్డినెన్స్ ప్రయత్నం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. సెప్టెంబర్ 2న మండల తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, 11న అధికార ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల ఇళ్ల దగ్గర నిరసన, 16న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద నిరసన, 27న చలో హైదరాబాద్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని ఆయన సమావేశంలో వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళిత రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ కుల, ప్రజా సంఘాలతో ఐక్యతతో సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. అలాగే, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల 62 శాతం బీసీ విద్యార్థులు త్రీవంగా నష్టపోతున్నారని, 5 శాతం లేని ఓసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ వ్యతిరేకమని వెంటనే ఈడబ్ల్యూస్ రిజరేషన్లు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై బీసీ ఎంపీలు, బీసీ సంఘాలు ఎందుకు పార్లమెంట్‌లో నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీకాంత్, వాడల భాస్కర్, గోలి నరేశ్, రోజా లీలా, పి.మోహన్ రావు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుకు రాష్ట్ర స్థాయి అవార్డు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 24: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ డిపో-1 మేనేజర్ కృష్ణారెడ్డి ఉత్తమ పనితీరుకు గాను 'ప్రగతి రథ చక్రం రోల్ ఆఫ్ హానర్' రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళా భవన్‌లో నిర్వహించిన టీజీ ఎస్ఆర్‌టీసీ ప్రగతి రథ చక్రం అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ డిపో-1 ఉద్యోగులంతా సమష్టి కృషితోనే ఈ అవార్డును అందుకున్నట్లు డీఎం కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ నెట్‌వర్క్‌లో మూగజీవాలకు రక్షణ

- మార్పులు చేసిన విద్యుత్ శాఖ
- హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద మెటల్ క్లాంపుల ఏర్పాటు

సిటీబ్యూరో, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): విద్యుత్ నెట్‌వర్క్‌లో తరచూ జరుగుతున్న అంతరాయాలపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇటీవల విద్యుత్తు తీగలు, పవర్ కండక్టర్లు, హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద మూగ జీవాలైన బల్లి, పిల్లి, పావురాలు, ఉడత, ఉడుము వంటివి మృత్యువాత పడ్డాయి. అదే సమయంలో దాని ప్రభావంతో ఆ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. ఏకంగా 11 కేవీ ఫీడర్లు పలు చోట్ల ట్రిప్ కావడంతో విద్యుత్ సరఫరాకు ఒక్కసారిగా అంతరాయం కలుగుతున్నది. మూగజీవాలు విద్యుత్ నెట్ వర్క్‌లలోకి రావడంవల్ల ఫీడర్ల ట్రిప్పింగ్‌లు 14 శాతం అవుతున్నాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తరచూ తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి పలు మార్పులు సూచించారు.



విద్యుత్ నెట్ వర్క్‌లో హెచ్‌జీ ఫ్యూజ్‌ల వద్ద ఏర్పాటు చేసిన మెటల్ క్లాంపులు

మెటల్ క్లాంపుల ఏర్పాటు..

విద్యుత్ నెట్‌వర్క్‌లో ఉపయోగించే పరికరాల్లో ప్రస్తుతం, హర్న్ గ్యాప్ ఫ్యూజ్ (హెచ్‌జీ ఫ్యూజ్) వద్ద మెటల్ క్లాంపులు వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ప్రత్యేకంగా రూపొందించిన ఫైబర్ రీన్‌ఫోర్స్‌డ్ పాలిమర్(ఎఫ్ఆర్‌బీ) సిలికాన్ క్లాంపులను ఏర్పాటు చేస్తున్నామని సీఎండీ ముషారఫ్ తెలిపారు. ఈ సిలికాన్ క్లాంపు విద్యుత్ వాహకంగా పనిచేయవు. మూగ జీవాలు వాటి మీదుగా పాకినా, నడిచినా ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. ముందుగా చెట్లు అధికంగా ఉండి, ఇలాంటి మూగ జీవులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో దాదాపు 3000 ఎఫ్ఆర్‌బీ సిలికాన్ క్లాంపులను ఫ్యూజ్, బ్రేకర్స్, లింబ్స్ వంటి చోట ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ మార్పుతో మూగ జీవాలకు ప్రాణ హానీ లేకుండా ఉండటంతో పాటు విద్యుత్ అంతరాయాలను కట్టడి చేసే అవకాశం ఉందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పేర్కొన్నారు.

కబ్జాలపై చర్యలు తీసుకోండి

- చెరువులు అన్యాక్రాంతం కాకుండా చూడండి
- బాలాపూర్ మండలంలో కబ్జాలపై హైడ్రాలో ఫిర్యాదుల వెల్లువ
- పార్టీలకు అతీతంగా ఫిర్యాదులు చేస్తున్న నేతలు

బడంగ్‌పేట, ఆగస్టు 24: బాలాపూర్ మండల పరిధిలో జరుగుతున్న భూ కబ్జాలపై నేతలు రోజూ ఫిర్యాదు చేస్తున్నారు. బాలాపూర్ మండల పరిధిలోని మీర్‌పేట, బడంగ్‌పేట, జిల్లెలగూడ, మల్లాపూర్, వెంకటాపూర్, నాదర్‌గుల్, అల్మాస్‌గూడ ఉన్న చెరువులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు లీలా రవినాయక్, ఇంద్రావత్ రవి నాయక్, సౌందర్య విజయ్ కుమార్ బీజేపీ నాయకులు చవ్వ శ్రావణ్ కుమార్, గడ్డం వెంకటేష్, సూరకర్ణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకుడు బొర్ర రవి కుమార్లు వేర్వేరుగా హైడ్రాలో ఫిర్యాదులు చేశారు. కొన్ని నెలల నుంచి జిల్లా కలెక్టర్‌కు, ఆర్డీవోలకు, తహసీల్దార్‌కు, హెచ్‌ఎండీఏ అధికారులకు, సీడీఎంఏ అధికారులకు, మున్సిపల్ కమిషనర్లకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా ఎవ్వరు పట్టించుకోక పోవడంతో హైడ్రా ను ఆశ్రయించామని ఫిర్యాదు దారులు పేర్కొంటున్నారు. మీర్‌పేటలో ఉన్న పెద్ద చెరువు 70 ఎకరాల ఉండగా, ప్రస్తుతం, ఆ చెరువు కుచించుక పోయిందన్నారు. లెనిన్ నగర్ సర్వే నం. 119,119/1,119/ 2.119/3లో ఉన్న ఏడెకరాల ప్రభుత్వ భూమి కబ్జా అయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంత మంది తప్పుడు ఇంటి నంబర్లు తీసుకొని జీవో 59, 58లో క్రమబద్ధీకరణ చేసుకున్నారన్నారు. ఎలాంటి ఆధారులు లేకుండా విద్యుత్ మీటర్లు ఇవ్వడం జరిగిందన్నారు. మీర్‌పేటలో ఉన్న చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువు మూడు చెరువులు కబ్జా అయినట్లు తెలిపారు. జిల్లెలగూడ సర్వే నం. 120, 121, 122, 123లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా చేయడం జరిగిందన్నారు. సర్వే నం. 132, 133, 137, 138 చంద్ర కాలనీ ఆర్‌సీఐ ప్రధాన రోడ్డుపై ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అయినట్లు వివరించారు. అల్మాస్‌గూడలోని కోమటి కుంట, పోచమ్మ కుంట, ఎర్ర కుంటతో పాటు కబ్జా అయిన ప్రభుత్వ భూములను, పార్కులను కాపాడాలని అల్మాస్‌గూడకు చెందిన సూర కర్ణారెడ్డి హైడ్రాలో ఫిర్యాదు చేశారు. బాలాపూర్ గ్రామంలో ఉన్న పెద్ద చెరువు, ఈసనాసన్ కుంటను కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని బాలాపూర్‌కు చెందిన నాయకులు తిమ్మని గిరీష్, గడ్డం వెంకటేష్, బొర్ర రవిలు హైడ్రాలో ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో, బఫర్ జోన్ పరిధిలో అడ్డగోలుగా నిర్మాణాలు చేస్తున్నట్లు వారు ఫిర్యాదులో వివరించారు. హైడ్రాపై నమ్మకంతో ఫిర్యాదులు చేసినట్లు వారు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి

ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నది

రవీంద్రభారతి, ఆగస్టు 24: తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తున్నదని తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి జితేందర్‌రెడ్డి అన్నారు. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఇన్ తెలంగాణ (సీఏబీటీ) ఆధ్వర్యాన సమావేశాన్ని రవీంద్రభారతి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జితేందర్‌రెడ్డి, ప్రముఖ హాస్యనటుడు, సాహితీవేత్త తనికెళ్ల భరణి, స్టార్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్యలు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి దాదాపు 40 వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన అంధ క్రీడాకారులకు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ, అంధులు కళ్ళు లేకున్నా గాని వారి మేధస్సు చాలా గొప్పదని, అంధుల్లో తెలివితేటలు అధికంగా ఉంటాయని, కళ్లు లేకున్నా సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నారని ఆయన తెలిపారు. అంధులు అయి ఉండి కూడా క్రీడల్లో రాణించడం సామాన్యమైన విషయం కాదన్నారు. జాతీయ స్థాయిలో అంధ క్రికెట్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వి.మాధవులు, మధుతో పాటు పలువురు క్రీడాకారులకు అవార్డులు అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో సీఏబీటీ అధ్యక్షుడు డాక్టర్ హరీశ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్, దైవజ్ఞ శర్మ, అంజిరెడ్డి పాల్గొన్నారు.

సీతారామ్‌కు దేవులపల్లి సాహిత్య పురస్కారం

పురస్కారాన్ని అందుకున్న ప్రముఖ కవి డాక్టర్ సీతారామ్

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 24: తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు సారస్వత పరిషత్తు 80 ఏండ్లుగా చేస్తున్న సేవలు అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. తెలుగు సాహిత్య ప్రక్రియలలో కవితలు, కవితా సంపుటాలు, విమర్శ వ్యాస సంపుటాలు, పరిశోధన గ్రంథాలు వెలువరించి సాహిత్యానికి సీతారామ్ చేస్తున్న సేవలను వక్తలు శ్లాఘించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు 107వ జయంతిని పురస్కరించుకొని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ప్రదానం చేసే డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాదికి గాను ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఆర్.సీతారామ్‌కు సీతారామ్‌కు ప్రదానం చేశారు. పురస్కారం కింద రూ.25 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక, శాలువాతో సీతారామ్‌ను సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ ప్రసంగిస్తూ సమాజంలోని సమస్యల పరిష్కారానికి సాహిత్యం కృషి చేసేలా రచయితల బాధ్యత అని గుర్తు చేశారు. పరిషత్తు అభ్యుదయంలో అనేకుల కృషి దాగి ఉందని వారిని స్మరించారు. సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు పాల్గొని సీతారామ్ సాహిత్య కృషిని కొనియాడారు.

వ్యాయామం, యోగాతో మెరుగైన ఆరోగ్యం

5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మాదాపూర్, ఆగస్టు 24: హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ చురుకైన జీవన శైలి ఉద్యమానికి నాయకత్వం వహించడం గొప్ప విషయమని ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ గ్రౌండ్‌లో ఐబీఎఫ్ఫ్ ఫస్ట్ బ్యాంక్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మద్దతునిచ్చే దిశగా అడుగులు వేస్తూ శనివారం 14 ఎన్‌జీఓలతో కలిసి ఎన్ఎండీసీ హైదరాబాద్ 5కే రన్ 13వ ఎడిషన్‌ను అట్టహాసంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 రేస్ డైరెక్టర్ రాజేశ్ వెచ్చా విచ్చేసి ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి, ఐబీఎఫ్ఫ్ ఫస్ట్ బ్యాంక్ హెడ్ బ్రాంచ్ బ్యాంకింగ్ సౌత్ నిరీశ్ లలాన్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ అథ్లెటిక్ బేసిక్ లేబుల్‌తో దీనిని అంతర్జాతీయ రన్నింగ్ క్యాలెండర్‌లో ఉంచినట్లు తెలిపారు. అంతర్జాతీయ ఎలైట్ అథ్లెట్ల భాగస్వామ్యంతో సహా రాష్ట్రాలు, యూటీలు ప్రపంచ అథ్లెటిక్స్ లేబుల్ రేసులో ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన విధానానికి సమతుల్యమైన ఆహారంతో పాటు వ్యాయామం, యోగా వంటివి దినచర్యలో భాగం కావాలన్నారు. చురుకైన జీవన విధానానికి మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలు చురుకైన జీవనశైలిని నడిపించడంలో సహాయపడటం, రన్నింగ్, ఫిట్‌నెస్ యాక్టివిటీకి ప్రాధాన్యతనిచ్చేలా చేయడం వంటి ఆలోచనతో స్థాపించబడినట్లు ఆయన తెలిపారు. 5కే రన్‌లో భాగంగా ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024